బతికి సాధిద్దాం..

- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం
- యువతలో పెరుగుతున్న బలవన్మరణ ధోరణి
- గడచిన నాలుగేళ్లుగా పెరిగిన ఆత్మహత్యలు
- గతేడాది జిల్లాలో 79 బలవన్మరణాలు



జీజీహెచ్‌లో మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్న బాధితులు

● రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడని తన 16 ఏళ్ల కుమారుడిని తండ్రి ప్రశ్నించడంతో మనస్తాపం చెందిన కుమారుడు తండ్రి అడిగిన గంటలోనే ఫ్యానుకు ఉరేసుకొని విగతజీవిగా వేలాడాడు. కాకినాడ జగన్నాథపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

● చదువులో ఒత్తిడి తాళలేక ఓ నర్సింగ్ విద్యార్థిని కాకినాడ అచ్యుతాపురంలోని హాస్టల్ వసతి గృహంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

కాకినాడ క్రైం: బతకడానికి అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆశా జీవుల వ్యధలు నిండా బతకాలన్న స్ఫూర్తిని నింపుతుంటే, బంగారం లాంటి నిండు జీవితాల్ని చిదిమేసుకుంటున్న నిరాశావాదుల జీవితాలు గుణపాఠాలకు ఆలవాలమవుతున్నాయి. నిండైన జీవితాన్ని రెప్పపాటులో ముగించేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. నానాటికీ ఈ ధోరణి పెరుగుతుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ మానవ మనుగడపై సవాల్ విసురుతున్న ఓ పెను సమస్యగా ఈ ధోరణిని గుర్తించింది. ఆ దిశగా అవగాహన కల్పించాలని భావించి 2003లో ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రకటించింది. ఏటా యావత్ ప్రపంచం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అవగాహనకు పెద్ద పీట వేస్తున్న ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రీవెన్షన్ (ఐఏఎస్‌పి) సంస్థకు ప్రత్యక్ష భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే మూడేళ్ల వ్యవధికి 'ఆశలు చివురించేలా చర్యలు చేపట్టడం (క్రియేటింగ్ హోప్ త్రూ యాక్షన్)' అనే నినాదంతో ప్రపంచానికి పిలుపునిచ్చింది. ఆత్మహత్యలకు వ్యతిరేకంగా గొంతెత్తి నినదిస్తోంది. ఈ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలోనూ రగిలేలా క్రియాశీలక చర్యలు చేపడుతోంది.

ఈ కారణాలతో...

ఆత్మహత్యలకు ప్రధాన కారణం డిప్రెషన్ అని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఆరోగ్య, ఆర్థిక సమస్యలు ఇందుకు కీలకం. ప్రేమలో వైఫల్యం, చదువులో వెనుకబాటు తనం, నిరుద్యోగం, ఉన్నపళంగా ఉద్యోగం పోవడం, అవమానం, అనుమానం, మోసం, అక్రమ సంబంధాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ర్యాగింగ్, మానసిక, శారీరక హింస, లైంగిక దాడులు, అప్పులు, అక్రమ సంబంధాల నేపథ్యం, వృత్తి జీవితంలో సమస్యలు, వ్యాపారాల్లో నష్టాలు, జీవితంపై నిరాశ వంటివన్నీ ఆత్మహత్యలను ప్రేరేపించే కారణాలే.

ఇలా ఉంటే జాగ్రత్త

ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకునే వారితో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఓ సారి ప్రయత్నం తప్పితే ఏ క్షణానైనా ప్రాణాలు తీసుకునే ప్రమాదం ఉంది. వారి మానసిక స్థితి వారిని ఆ దిశగా నడిపిస్తుంది. ఒంటరిగా ఉండటం, ఏవో ఊహల్లో విహరించడం, అప్పటివరకు దిగులుగా ఉన్న వ్యక్తి పట్టలేని సంతోషంతో వ్యవహరించడం, ఆత్మహత్య, సంబంధిత విషయాలపై తరచు మాట్లాడటం, బాధ్యతలు పూర్తి చేసే ప్రయత్నం చేయడం, బీమా వివరాలు ఇంట్లో వారికి అందించడం, కుటుంబీకుల్ని చూసి అకారణంగా ఒక్కసారి కన్నీటి పర్యంతం కావడం, తన జీవితం ఎందుకూ పనికి రానిదంటూ పలుమార్లు ప్రస్తావిస్తూండడం, డబ్బు ఖర్చులో పొదుపు, జాగ్రత్త లోపించి విచ్చలవిడిగా వ్యవహరించడం. ఏదో తప్పు చేశాననో, ఏదో తప్పు జరిగిందనో నిత్యం కుమిలిపోవడం లాంటి లక్షణాలతో వ్యవహరించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వారు ఏ క్షణానైనా బలవన్మరణానికి పాల్పడే అవకాశం ఉంది.

జిల్లాలో గడచిన ఐదేళ్లలో ఆత్మహత్యలు ఇలా..

2018–	61
2019–	67
2020–	92
2021–	113
2022–	102
2023–	79

(ఆగస్టు నెలాఖరు నాటికి)

ఆ మూడు రోజులు కీలకం

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన తక్షణ సమయం చాలా కీలకమైనది. ఆ వెంటనే మానసిక నిపుణుల వద్దకు తీసుకు వెళ్లాలి. 36 నుంచి 72 గంటల వ్యవధిలో మరోమారు ఆత్మహత్యకు ప్రయత్నించే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

చనిపోవాలని అనిపిస్తే...

ఆత్మహత్యకు పాల్పడాలనిపించే వారు ఆ ఆలోచన నుంచి తక్షణం బయటపడాలని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు పలు శాస్త్రీయ మార్గాలు సూచిస్తున్నారు. ఆ ఆలోచనలు వస్తే వైద్యుడిని సంప్రదించాలి. అప్పటి వరకు జీవితంలో చోటు చేసుకున్న సానుకూల అంశాలు, సాధించిన విజయాలను కాగితంపై రాసుకోవాలి. అవి సాధించడానికి పడ్డ కష్టాన్ని, తర్వాత ఆస్వాదించిన ఆనందాల్ని తలచుకోవాలి. తమపై ఆధారపడ్డ వారిని, ముఖ్యంగా పిల్లల్ని తలచుకుంటూ వారితో గడిపిన ఆనంద క్షణాల్ని నెమరువేసుకోవాలి. తాను లేకపోతే కుటుంబ స్థితి ఏ స్థాయికి దిగజారుతుందో గుర్తెరగాలి. అంతే కాక, ఎత్తైన ప్రాంతాలు, నీటి వనరులు, విద్యుత్ తీగల వద్ద ఉండకూడదు. ఆత్మహత్యకు అవకాశం ఉండే వస్తువులు, మాత్రలను దగ్గరగా ఉంచుకోకూడదు.

జీజీహెచ్‌లో వైద్య సేవలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య విభాగం ఉంది. ప్రతి రోజు 10ఏలో ఓపీ చూస్తారు. నిష్ణాతులైన వైద్యులు సేవలందిస్తారు. 30 పడకల ప్రత్యేక వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో స్త్రీలు, పురుషులకు విడివిడిగా వైద్య సేవలు అందిస్తారు. రోగికి పూర్తిగా మానసిక స్థితి సరయ్యే వరకు ఉచిత మందులు ఇస్తారు. ఖరీదైన మానసిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేస్తారు.

మూఢనమ్మకాలతో ముప్పు తేవద్దు



వ్యక్తుల మానసిక సమస్యలపై అంచనా లేకుండా మూఢనమ్మకాలతో దెయ్యం పట్టిందని ప్రచారం చేయడం నివారణకు తాయత్తులు, మంత్రాలు ప్రయోగించడం ఏ మాత్రం సరి కాదు. ఈ స్థితి ఆత్మహత్య ఆలోచనలతో సతమతమవుతున్న బాధితుడి ప్రాణానికి కూడా ముప్పుకావచ్చు. ఆత్మహత్య భావోద్వేగాల అంశమే తప్ప వయసుతో నిమిత్తం లేదు. ఏ వయసు వారికైనా ఆలోచన రావచ్చు. బాధితుల్లో స్వీయ ద్వేషం ఎక్కువగా ఉంటుంది. హోప్‌లెస్ నెస్, హెల్ప్ లెస్ నెస్, వర్త్ లెస్ నెస్ సమస్యలు గుర్తిస్తే తక్షణమే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. తాజా గణాంకాలను అనుసరించి ఆత్మహత్యకు కారణమవుతున్న డిప్రెషన్‌తో 18 ఏళ్ల లోపు పిల్లలు ప్రతి నలుగురిలో ఒకరు బాధపడుతున్నారు.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ సైకియాట్రి, ఆర్ఎంసీ, కాకినాడ

ఉద్యోగుల సంక్షేమానికి ఏపీజీఈఎఫ్ కీలకపాత్ర



ఏపీజీఈఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న వెంకట్రామిరెడ్డి

బోట్‌క్లబ్: ఉద్యోగుల సంక్షేమానికి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) కీలక పాత్ర పోషిస్తుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. జెడ్పీ కల్యాణమండపంలో శనివారం ఫెడరేషన్ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షురాలుగా డి.శ్రీలలిత, ప్రధాన కార్యదర్శిగా డి.తాతాజీరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఆయా జిల్లాల ఫెడరేషన్లను బలోపేతం చేసేందుకు కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నారు. త్వరలోనే సీపీఎస్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు సీఎం జగన్ హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవరపాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, ఫెడరేషన్ కో చైర్మన్ వీఎస్ దివాకర్, కోశాధికారి జి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మట్టి సేకరణ

కరప: మండలంలో శనివారం వివిధ గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్టా వీరప్రసాద్‌గాంధీ మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి భారతీయుడు ×నామట్టి–నాదేశం×లో భాగస్వాములు కావాలన్నారు. అక్టోబరు 31 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

క్లుప్తంగా

సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనోత్సవం



కరపత్రాలతో మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు తదితరులు

కాకినాడ రూరల్: వినాయక చవితి ఈ నెల 18న ప్రారంభమై 26న ముగిస్తుందని, 27, 28 తేదీల్లో సూర్యారావుపేట బీచ్ వద్ద సముద్రంలో గణపతి విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని నగర గణేశ ఉత్సవ సమితి కన్వీనర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య తెలిపారు. రూరల్ ఉత్సవ కమిటీ సమావేశాన్ని కో ఆర్డినేటరు రంబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం కవికొండల భీమశంకర్ నివాసంలో నిర్వహించి నిమజ్జనోత్సవం పెద్ద ఎత్తున జరగాలని, అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఉత్సవ కమిటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో కవికొండల భీమశేఖర్, పితాని లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న కోరమాండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి, విజయలక్ష్మి, లక్ష్మీ సృజన, అడబాల రత్నప్రసాద్, పార్థ సారధి, రాఘవరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా రామ్‌కుమార్



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా యార్లగడ్డ రామ్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో ఆయన రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ పదవి అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పలువురు బీజేపీ సీనియర్ నాయకులు అభినందించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



కార్డియాక్ పల్మనరీ రీసక్సియేషన్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

బాలాజీచెరువు: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. గాంధీనగర్‌లో అపస్మారక స్థితిలో ఉన్న రోగికి ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలి అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. కార్డియాక్ పల్మనరీ రీసక్సియేషన్ ఎలా చేయాలో తదితర అంశాలపై అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హాండ్స్, హెల్త్ అవేర్ సంస్థ ఈసీపీఆర్ శిక్షణ కార్యక్రమం శనివారం ప్రథమ చికిత్స దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. అలయ్ కిరణ్ కుమార్, ఉప గవర్నర్ వనుం శ్రీనివాసరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పొటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి రూ.4,49,254 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు ఎనిమిది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేసినట్లు ఈఓ తెలిపారు.

11న మోటారు సైకిళ్ల వేలం

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో 102 సీఆర్‌పీసీ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లను 11వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ సందర్భంగా సీఐ కె.దుర్గాప్రసాద్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి పర్యవేక్షణలో స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు. వివరాలకు 97016 26505 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పండగలా కొత్త పింఛన్ల పంపిణీ



కరపలో కొత్త పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు

కరప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం కొత్త పింఛన్ల పంపిణీ పండగలా నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు శనివారం పలు గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, వలంటీర్లతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 62 మంది లబ్ధిదారులకు సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, సాదే లోహిదాస్, కె.రూపేంద్ర వలంటీర్లతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పార్టీలు చూడకుండా అర్హతే ప్రమాణికంగా పింఛన్లు ఇస్తున్నారని అన్నారు. మండలానికి కొత్తగా 554 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. వలసపాకల, కొరుపల్లి, ఉప్పలంక, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, పలివెల నాగేశ్వరరావు, బొమ్మిడి నయోమి, వెలుగుబంటి సీతారామరాఘవ, కాదా వెంకటేశ్వరరావు, కాలాడి కామేశ్వరరావు, బొమ్మిడి సతీష్ తదితరులు కొత్తపింఛన్లు అందజేశారు.

ఎస్సై చొరవతో సమస్య పరిష్కారం

- మానవత్వంతో ముద్దాయికి రూ.10 వేల సాయం చేసిన ఫిర్యాదీ



గంగరాజుకు రూ.10 వేలు అందజేస్తున్న విజయ్‌కుమార్

కరప: స్థానిక ఎస్సై ఎన్.రామకృష్ణ చొరవతో ఒక కేసు పరిష్కారమవ్వడమే కాకుండా ఫిర్యాదుదారే ముద్దాయికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించాడు. లోక్ అదాలత్ కోర్టులో ఇరువురు రాజీపడటంతో కేసును ముగించారు. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన కథనం మేరకు.. నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన గంగుల గంగరాజు మోటార్‌సైకిల్‌తో కరప గ్రామానికి చెందిన నక్కా విజయ్‌కుమార్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ముద్దాయి గంగరాజుకు తగిలిన గాయాలు, అతని ఆర్థిక పరిస్థితిని గమనించిన ఎస్ఐ విజయ్‌కుమార్‌ను పిలిచి ముద్దాయి పరిస్థితిని వివరించారు. దీంతో చలించిన విజయ్‌కుమార్ లోక్ అదాలత్ ద్వారా రాజీ పడటానికి అంగీకరించి, ముద్దాయికి రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. శనివారం లోక్ అదాలత్ ద్వారా ఇరువురు రాజీపడటంతో కేసు క్లోజ్ అయినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ముద్దాయికి సాయం చేయడం అరుదైన సంఘటన అని ఎస్ఐ పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ కాకినాడ అధ్యక్షుడిగా నూకరాజు



జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు నూకరాజు



కార్యదర్శి మూర్తి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా మూర్తి శనివారం ఎన్నికయ్యారు. స్థానిక అశోక్‌నగర్‌లోని పాలపర్తి చిన కొండలరావు భవన్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 102వ సంఘ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలకు నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వీ సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంధం వసంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్తపల్లి జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న బండి నూకరాజును అధ్యక్షుడిగా, చింతూరు జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న పోలిశెట్టి మూర్తిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కరప మండలం విద్యాశాఖాధికారి పత్తి సత్యనారాయణ వ్యవహరించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 2076 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌ను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు పి.కమలాదేవి, ఎస్.శ్రీనివాసరావు

కాకినాడ లీగల్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 2076 కేసులు పరిష్కారమయ్యాయని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. కాకినాడలో శనివారం 11 బెంచ్‌లు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్ (ఇన్సూరెన్స్) కేసులు, సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ఇతర అనేక కేసులు పరిష్కారమయ్యాయి. ఈ బెంచ్‌లకు న్యాయమూర్తులుగా 4, 6 అదనపు జిల్లా జడ్జిలు ఎం.హరినారాయణ, ఆర్‌వీ నిఖిత, ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్ సుందరి, ఒకటో జూనియర్ సివిల్ జడ్జి వి.సాహితి, రెండో అదనపు సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి, మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి, నాలుగో అదనపు జ్యుడీషియల్ సివిల్ జడ్జి నీరూప, ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ షిరిన్, స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఉషా లక్ష్మికుమారి, స్పెషల్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి వ్యవహరించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సహకరించాలి

- పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకరరావుతో కన్నబాబు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను గజమాలతో సత్కరిస్తున్న పుల్ల చందు, తదితరులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి సీనియర్‌గా సహకరించాలని పార్టీ నూతన కార్యవర్గంలో జిల్లా కార్యదర్శిగా నిమితులైన పుల్ల ప్రభాకరరావును పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. తనకు పదవి ఇచ్చిన కన్నబాబుకు కృతజ్ఞతలు తెలియజేసేందుకు సర్పవరం నుంచి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో శనివారం రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయానికి ప్రభాకరరావు వచ్చారు. ఈ సందర్భంగా కన్నబాబును గజమాలతో సత్కరించారు. అలాగే శాలువాతో ప్రభాకరరావును కన్నబాబు సత్కరించి అభినందించారు. వచ్చేది ఎన్నికల కాలమని రాజకీయ అనుభవం ఉన్న సర్పవరం ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు సేవలను పార్టీకి వినియోగించుకునేందుకు జిల్లా కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించామని కన్నబాబు పేర్కొన్నారు. ప్రభాకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, సీఎం జగన్, ఎమ్మెల్యేగా కన్నబాబు విజయం సాధిస్తారన్నారన్నారు. పుల్ల చందు, కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, పుల్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ నుంచి మారేడుమిల్లికి బైక్ ర్యాలీ



సూర్యారావుపేట బీచ్ వద్ద మారేడుమిల్లికి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రికీ గూటమ్ తదితరులు



సూర్యారావుపేట బీచ్‌లో 5కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ రూరల్: సురక్షితమైన రైడింగ్, హెల్మెట్ ధరించడం, రహదారి మార్గంలో పాటించవల్సిన ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై అవగాహన కలిగించే లక్ష్యంతో సుమారు రెండు నెలల క్రితం కాకినాడలో ఏర్పాటు చేసిన నైట్ హాక్ రైడింగ్ క్లబ్ సభ్యులు 30 మంది శనివారం మారేడుమిల్లికి ర్యాలీగా వెళ్లారు. సూర్యారావుపేట బీచ్ నుంచి ఏడీబీ రోడ్డు మీదుగా ర్యాలీగా బయలుదేరారు. అంతకు ముందు ర్యాలీని ఏపీసీసీ జిల్లా అధ్యక్షుడు రికీ గూటమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది సభ్యులతో నైట్ హాక్ రైడింగ్ క్లబ్ ఏర్పాటు చేశారన్నారు. క్లబ్ ముఖ్య ఉద్దేశం హెల్మెట్ అన్ని వేళల ధరించడం, గేర్లు జాగ్రత్తగా వేస్తూ భద్రత కలిగేలా బైక్ నడపడం, ట్రాఫిక్ రూల్స్ పాటించడం, అన్ని వేళల బైక్ రైడింగ్‌లో అప్రమత్తంగా ఉండడం ప్రధానమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ భరత్, హేమంతరావు, కార్యదర్శి నిఖిల్, కోశాధికారి హన్సిఫ్ మహ్మద్, స్పెషల్ అడ్వైజర్ మహేంద్రతో పాటు రాజారావు, రమేష్ పాల్గొన్నారు.

పోషకాహార ప్రాముఖ్యతపై 5కె రన్

జాతీయ పోషకాహార వారాన్ని పురస్కరించుకుని సూర్యారావుపేట బీచ్‌లో విద్యార్థులు శనివారం 5కె రన్‌లో పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన శైలి కొనసాగించడానికి పోషకాహార ప్రాముఖ్యాన్ని ఈ సందర్భంగా న్యూ సెంచరీ స్కూల్ విద్యార్థులు స్థానికులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిహారిక, ఏట గణపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

అద్దేపల్లి సాహితీ సేవలు ఆదర్శనీయం

- మేడిపల్లికి అద్దేపల్లి సాహిత్య విమర్శ పురస్కారం



సభలో ప్రసంగిస్తున్న పురస్కార గ్రహీత మేడిపల్లి రవికుమార్

కాకినాడ కల్చరల్: ప్రజాకవి అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య సేవలు ఆదర్శనీయమని ప్రముఖ కవి, పురస్కార గ్రహీత మేడిపల్లి రవికుమార్ అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య విమర్శ పురస్కార వేదిక ఆధ్వర్యంలో అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య విమర్శ పురస్కారం ప్రదానోత్సవం శనివారం సాయంత్రం వేదిక అధ్యక్షులు అద్దేపల్లి ఉదయభాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉదయభాస్కరరావు రచించిన 'బలికావడం మానుకో', త్వరగా బతకాలి పుస్తకాలను ఆవిష్కరించారు. అద్దేపల్లి ఎంతో మంది యువ రచయితలను ప్రోత్సహించి సాహితీ రంగానికి ఎనలేని సేవలు చేశారని విశ్రాంత అధ్యాపకుడు కొపెల్ల అన్నారు. సామ్యవాద ధోరణిలో కవిత్వ రాసినా సనాతన ధర్మ పరిరక్షణకు జీవితాంతం కట్టుబడి ఉన్నారని విశ్రాంత అధ్యాపకుడు గాంధీ అన్నారు. అద్దేపల్లి తన ఆశయాలను సాహితీ స్రవంతి ద్వారా సమాజానికి అందించారని ఎస్వీ యూనివర్సిటీ (తిరుపతి) వక్తలు అన్నారు. మేడిపల్లి రవికుమార్‌కు అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య విమర్శకుడిగా పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. విద్యార్థులకు అద్దేపల్లి రచించిన 'స్నేహం' అనే కవిత్వంపై నిర్వహించిన పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సుంకర గోపాల్, పద్మజావాణి తదితరులు పాల్గొన్నారు.

17న శెట్టిబలిజ కుటుంబాల ఆత్మీయ సభ

మంత్రి వేణు, ఎమ్మెల్యే ద్వారంపూడికి సత్కారం

కాకినాడ: నియోజకవర్గ పరిధిలోని శెట్టిబలిజ కుటుంబాల ఆత్మీయ సమ్మేళన సభను ఈ నెల 17న నిర్వహించనున్నట్టు సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక సూర్యకళామందిరంలో ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు పదవీకాలం ఏడాది పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధ, సినిమాటోగ్రఫీ, బీసీ సంక్షేమ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను సత్కరించనున్నారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ కులస్తుల అభివృద్ధి, సంక్షేమంపై సమావేశంలో చర్చిస్తామని నిర్వాహకులు తెలిపారు.